# రివర్స్ గేర్

కె.బి.కృష్ణ



‘‘అసలే కరువు రోజులు. నలుగురు మగపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి. మాటలా? ఏం రోజులో ఏమిటో పెద్దాడికి ఎంతో మంది అమ్మాయిలు వచ్చి చూసి వెళ్తున్నారు. ఎవరికీ వాడు నచ్చడం లేదు. ఆ కాస్సేపు వినయంగా వుండి చావరా అంటే వాడు వినడు. ఆ సమయంలోనే పురుషాహంకారం చూపిస్తాడు. అవి వెనకటి రోజులు రావెధవాయ్ ఈ రోజుల్లో మిమ్మల్ని నలుగుర్ని గుండెల మీద కుంపట్లులా, ఎలా ఒక అమ్మాయి చేతిలో పెట్టి కళ్ళు మూసుకోవాలా అని మథన పడుతున్నానని చెప్పినా వినరు. వెధవాయిలు. “పాపం నలుగురు అబ్బాయిల తండ్రి కుటుంబరావుగారి ఆవేదన ఏం చెప్పమంటారు? అబ్బాయిలయితే హాయిగా కట్నం గుంజొచ్చు అనుకుని నలుగుర్ని కన్నారు. కాని పరిస్థితి ఇలా వస్తుందని ఆయన అనుకోలేదు.

అమ్మాయిలు తన అబ్బాయిలను చూడటానికి వస్తూనే, వినయంగా వుంటాడా? సిగరెట్లు కాల్చడు కదా, బార్‌కి వెళ్ళనని బాండ్ వ్రాసి ఇస్తాడా? జడ వెయ్యగలడా? వంట చెయ్యగలడా? ఇత్యాది ప్రశ్నలు. అక్కడికీ తల్లి చేత అన్ని పనులు నేర్పించాడు. మగ ముండాకొడుకుల్లాగ గెడ్డాలూ మీసాలు పెంచకండిరా. ఎవరైనా అమ్మాయిలు

చూస్తే వీళ్ళకి పొగరు అని పెళ్ళి చేసుకోరు అని చెప్పాడు. అయినా వినరు ఏం చేయాలో ఏమో

రేపు విశాఖపట్నం నుంచి పెద్దాడిని చూడటానికి ఒక అమ్మాయి వస్తోంది ఆ అమ్మాయికైనా వీడు నచ్చితే, వీణ్ణి ఒక అమ్మాయి చేతిలో పెడితే ఇంకా ముగ్గురు శుంఠలకు పెళ్ళి చేయాలి ఉన్న ఆస్తి సరిపోతుందో లేదో

వెనకటికి అమ్మాయిలు పుడితే ఏడిచేవారుట. అలాంటిది ఇప్పుడు అబ్బాయిలు పుడితే ఏడవాల్సి వస్తోంది ఇదెక్కడి ప్రారబ్ధమో

రేపటి కోసమని, పెద్దాడిని గెడ్డాలూ మీసాలు తీసేసి, మధ్యపాపిడ తీసుకుని, గళ్ళ చొక్కా వేసుకోకుండా, తెల్లని చొక్కా వేసుకోమని, వినయంగా అమ్మాయి ఎదురుగా కూర్చోమని పెద్దాడికి తగిన జాగ్రత్తలు చెప్పాడు.

ఆ క్షణం రానే వచ్చింది ఇంటి ముందు కారాగింది. కుటుంబరావు ఎదురు వెళ్ళి, అమ్మాయిని, ఆమెగారి తల్లి తండ్రులను లోపలకు తీసుకొచ్చాడు. కుటుంబరావుగారి నలుగురబ్బాయిలు సిగ్గుతో లోపలకు వెళ్ళి పోయారు. అమ్మాయి తండ్రి లోపలకు వస్తూనే "మీ అబ్బాయిలకు సిగ్గు ఎక్కువనుకుంటాను అయినా ఇల్లు చాలా శుభ్రంగా ఉంది. మీ అబ్బాయిలకు చక్కగా ఇంటి పనులు నేర్పారనుకుంటాను. ఈ ముగ్గులు ఎంత బాగున్నాయో ఏ అబ్బాయి పెట్టాడో"

"ఇప్పుడు తమరు చూడబోయే అబ్బాయే ఇల్లు అంతా తీర్చి దిద్దాడండి" కుటుంబరావు వినయంగా అన్నాడు

"హేయ్ లవ్లీ డాడ్ మన ఇంట్లో ఇంతకన్నా చక్కని ముగ్గులు పెట్టించాలి. అది సరే ముగ్గులతో సరి పెట్టాడా మిగతా ఇంటి పనులు వచ్చునా?" అడిగింది అమ్మాయి

"వ- వచ్చునమ్మా- ఇప్పుడు మీరు తినబోయే ఫలహారాలన్నీ అబ్బాయే చేశాడు" అంటూ గడగడ వణుకుతూ చెప్పాడు కుటుంబరావు.

"అదీ చూస్తాం కదా" అందా అమ్మాయి.

ఈలోగా ఫలహారాలు తీసుకుని పెళ్ళి కొడుకు కళ వచ్చాడు. అతను సిగ్గుతో చితికి పోతున్నాడు. ఆమె అతన్ని తదేకంగా చూస్తోంది నఖ శిఖ పర్యంతం చూస్తోంది.

ఫలహారాలు అందించేక-

"ఇక కూర్చోవచ్చు. మరీ అంత సిగ్గయితే ఎలాగ. నేను పది మందిలో కూర్చున్నప్పుడు కాఫీ టిఫిన్స్ సర్వ్ చేయాల్సి వస్తుంది.

"సరే-" అంటూ ఆమెకు ఎదురుగా సోఫాలో ఒదిగి ఒదిగి కూర్చున్నాడు కళ. (కళాధర్)

"బైది బై, అంకుల్ మీ అబ్బాయి నచ్చాడు మీ అబ్బాయిని చేసుకోడానికి షరతులు. కట్నం ఏభైవేలు అది కూడా ముగ్గులు చూసి సగం రిబేట్ ఇచ్చాను. మా తల్లితండ్రులకు చెరి పదివేలు లాంఛనాలు. శోభనం రోజున నాకు కట్నం ఐదువేలు ఇక మీకు తెలియని వేముంది నాకు తగ్గట్లు మర్యాదలు

"అమ్మా- నేను అంత ఇచ్చుకోలే-

"డాడీ లేవండి ఇంతకన్న గొప్ప సంబంధాలు నాకు వస్తున్నాయి లెటజ్ సీ ఎనదర్ బోయ్" అంటూ లేవబోయింది.

"అమ్మాయి వెళ్ళకమ్మా- మా అబ్బాయిని ఇంతవరకూ ఇరవై మంది అమ్మాయిలు చూశారు నచ్చలేదని అన్నారు నువ్వు వెళ్ళి పోయావంటే వాడి జీవితం బుగ్గి అయి పోతుంది వాడితమ్ముళ్ళకి పెళ్ళి ఎలా అవుతుంది?

"నో-" అని కుటుంబరావుగార్ని నెట్టుకొని వెళ్ళింది.

అక్కడే నిలబడి, కళ, అతని తమ్ముళ్ళు ఏడుస్తున్నారు

★ ★ ★ ★ ★

"నో-" అంటూ గట్టిగా అరుస్తూ మంచం మీద నుంచి లేచారు కుటుంబరావుగారు

"నాన్నగారూ" అంటూ కళాధర్ తండ్రి పడకగదిలోకి వచ్చాడు

"రాజమండ్రికి ఫోన్ చేసి ఆ అమ్మాయిని కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటామని చెప్పు"

"సరే"

అంత వరకు లక్షకు ఒక పైసా కట్నం తగ్గినా ఆ అమ్మాయిని చేసుకోమని చెప్పిన తండ్రిలో, ఇంతటి మార్పు ఎలా వచ్చిందో అర్థంకాక, తనకు నచ్చిన ఆ అమ్మాయితో జీవితం రంగుల కలగా ఊహించుకుంటున్నాడు కళాధర్ □





